క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు అందజేసిన నాయకులు

కడ్తాల్: మండల పరిధి మక్తమాధారం గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు.. బీజేపీ జిల్లా నాయకుడు నింగ్యారి యాదగిరి బుధవారం భోజన ప్లేట్లు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, మాజీ అధ్యక్షుడు మాన్య నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు రెడ్యానాయక్, వెంకటేశ్, నరేశ్, శంకర్, హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సింహ, మంజుల ఉన్నారు.

సీఐ మహేందర్‌రెడ్డికి సత్కారం



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: నూతన సీఐ మహేందర్‌రెడ్డిని.. పోల్కంపల్లి మాజీ ఎంపీటీసీ చెరుకూరి రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కావలి లక్ష్మణ్, పూల శ్రీనివాస్, గ్రామ పెద్దలు పెంటయ్య, వెంకటేశ్, పరమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో బోర్డు ఏర్పాటు



కమ్మగూడ పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

తుర్కయంజాల్: పార్కు స్థలాలను కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 15న 'పార్కు స్థలాలు కబ్జా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి కమిషనర్ స్పందించి, అదే రోజు స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం బుధవారం సర్వే నంబర్ 227, 228లోని 871 గజాల చదరపు గజాల పార్కు స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. దీంతో పాటు తొర్రూర్ సైబర్ సిటీలోని 2000 గజాల పార్కులోను బోర్డును ఏర్పాటు చేయించారు. పార్కు స్థలాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాలనీలో కనీస వసతులు కల్పించండి



కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: కాలనీలో కనీస వసతులు కల్పించాలని విద్యానగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నాయక్‌కు కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పాష, కోశాధికారి సుదర్శన్, ఉపాధ్యక్షుడు శేఖర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీటి సౌకర్యంతో పాటు సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మించాలని పేర్కొన్నారు. పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని, రోడ్లను తరచూ శుభ్రం చేయాలని కోరారు. ఇందులో కాలనీ వాసులు రాములు, మల్లయ్య ఉన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల అందజేత



మెడికల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను.. బుధవారం మండల పరిధి రాంనుంతల గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్‌లు గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శేఖర్, సోమ్లునాయక్, హమ్లానాయక్, ధన్‌రాజ్, ఆశ కార్యకర్తలు దర్జి, గౌరి, రోహిణి, సంతోష, అంగన్‌వాడీ టీచర్ అలివేలు పాల్గొన్నారు.

సారూ.. సాయమేది?

రానివారికి రానేలేదు.. వచ్చినవారికి సగమే

- 'భరోసా' దక్కలేదంటూ రైతుల ఆందోళన
- రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాలకు పరుగు
- పెట్టుబడి సాయం ఏమైందంటూ ఆరా



రైతువేదిక భవనంలో భరోసా అందలేదని వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఆరా తీస్తున్న రైతులు

మంచాల: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రవేశ పెట్టిన పథకం రైతుభరోసా. గత ప్రభుత్వం ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు ఇవ్వగా.. కాంగ్రెస్ సర్కార్.. దానిని రూ.12 వేలకు పెంచింది. ఏడాదిన్నర కాలంలో రెండు దఫాలుగా అర్హుల ఖాతాల్లో భరోసా డబ్బులు వేసింది. రెండోసారి నిన్నమొన్నటి వరకు అర్హులైన వారి ఖాతాల్లో భరోసా నిధులు జమచేసింది. 'భరోసా' సంబురాలను చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. మంచాల మండలంలో భరోసా అందని వారికి అందనే లేదు. వచ్చిన వారికి సగంసగం డబ్బులే వచ్చాయి. దీంతో ఆందోళన చెందిన అన్నదాతలు వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. సారూ పెట్టుబడి సాయం రాలేదంటూ ఫిర్యాదు చేస్తున్నారు.

3,708 మందికి రాలేదు

రైతు భరోసా పథకం అమలు తీరుపై రైతులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయం అందని వారు కొందరైతే.. మరికొందరికి సగమే డబ్బులు రావడం గమనార్హం. మండలంలో సాగుకు యోగ్యమైన భూములు 23వేల 493 ఎకరాలు ఉన్నాయి. సాగుచేస్తున్న వారు 17వేల 470 మంది రైతులు. వారికి రూ.14 కోట్ల, 09లక్షల 63వేల 889 పెట్టుబడి సాయం అందాలి. కానీ ప్రస్తుతం 13వేల 762 మందికి రూ.11కోట్ల 59లక్షల 93వేల 889ల సహాయం మాత్రమే వచ్చింది. ఇంకా 3వేల 708 మందికి రావాల్సి ఉంది.

రూ.6 వేలకు.. 3వేలే

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట ఎకరాకు పంటసాయంగా రూ.5 వేలు ఇవ్వగా.. ప్రస్తుత ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించింది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఎప్పుడెప్పుడు ప్రభుత్వం ఇస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో.. భరోసా నిధులు విడుదల చేసింది. అర్హుల బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా డబ్బులు జమచేసింది. అంతా బాగుందనుకున్న తరుణంలో.. ఎకరాకు రూ.6 వేలు రావాల్సిన డబ్బులు.. రూ.3 వేలు, మరికొంత మందికి రూ.3 వేల 500, ఇంకొంత మందికి రూ.5 వేలు వచ్చాయి. కానీ ఏ ఒక్క రైతుకు ఎకరాకు రూ.6 వేలు పూర్తి స్థాయిలో జమకాలేదు. దీంతో ఆందోళన చెందిన రైతులు.. బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. కొందరికి వచ్చి, ఇంకొందరికి రాక పోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా రాని వారు ఆందోళన చెందుతూ.. మాకు ఎందుకు రాలేదని, ఎప్పుడు వస్తాయని బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు.. రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

అర్హుల్లో సగం మందికే..



యాచారం: 'రైతు భరోసా నిధుల్లో ప్రభుత్వం కోత పెట్టింది. కేవలం 50 శాతం మంది రైతులకు మాత్రమే పూర్తి స్థాయిలో సాయం చేసింది' అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ ఆరోపించారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎకరాకు రూ.6 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. తీరా చూస్తే అర్హుల్లో సగం మందికే.. వారివారి ఖాతాల్లో డబ్బులు జమచేశారని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లోని రైతులకు పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం భరోసా అందలేదన్నారు. అన్ని ఎకరాలకు పూర్తిగా రైతు భరోసా ఇస్తామని ప్రకటించి.. ఇప్పుడు గుట్టలు, రాళ్లు, రప్పలు, వాగులు, వంకలు ఉన్న భూములకు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. సాగు భూములకు మొత్తం భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

భరోసా లేదు.. మాఫీ కాలేదు



నాకు ఒక 1.07 ఎకరాల భూమి ఉంది. రైతు భరోసా పథకం కింద రూ.7వేల 50 రావాలి. ప్రస్తుతం రూ.5 వేల 400 మాత్రమే వచ్చాయి. ఇంకా రూ.1,650 రావాల్సి ఉంది. రుణమాఫీ అసలే చేయలేదు. అడిగితే అధికారులు అప్పుడు.. ఇప్పుడు అంటూ బదులు ఇస్తున్నారు.

– సింగారం అంజయ్య, రైతు, జాపాల

న్యాయం జరుగుతుంది



సాయం అందని రైతులు ఇబ్బంది పడొద్దు. రైతు భరోసా పథకం కింద పంటలు సాగు చేసిన వారికి సాగుసాయం కచ్చితంగా అందజేస్తాం. సమస్యను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుంది.

– వెదిరె హన్మంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, మంచాల

ఆగస్టు లోపు అందరికీ..



గత యాసంగి పంటలకు రెండు దఫాలుగా పంట పెట్టుబడి సాయం వచ్చింది. ఆగస్టు నెలలోపు అర్హులందరికీ పూర్తి స్థాయిలో రైతుభరోసా దక్కుతుంది. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– లింగస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి, మంచాల

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని అబ్దుల్లాపూర్ మెట్, కవాడిపల్లి, బండరావిరాల, చిన్న రావిరాల, బాటసింగారం, జాఫర్‌గూడ, ఇనాంగూడ, లష్కర్‌గూడ గ్రామాల్లో రూ.1.43 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు.. చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చిత్తారి, శ్రీనివాస్‌రెడ్డి, యశోధ, నాయకులు మహేందర్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, ఎండీ గౌస్ పాష, ప్రభాకర్‌రెడ్డి, అధికారుల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధితుడికి చెక్ అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సోమరాజు శేఖర్ ఆరోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల సాయం కోసం ఆయన.. నాయకుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిని ఆశ్రయించగా.. ఆయన, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బాధితుడి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ప్రవీణ్, రామకృష్ణ ఉన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థం

సీఐ గంగాధర్

కడ్తాల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో.. గంజాయి, ఆల్కాహాల్, కల్తీకల్లు, డ్రగ్స్ తదితర వాటిని తీసుకోవడం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతందని తెలిపారు. ఆన్‌లైన్ వేధింపులు, అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా మత్తు పదార్థాల వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, అదే మిమ్మల్ని విజయాల దరికి చేరుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మత్తు పదార్థాల వలన కలిగే నష్టాల గురించి పేర్కొంటూ ప్రచురించిన వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ప్రిన్సిపాల్ జైసస్, పోలీసు సిబ్బంది రాంకోటి, శ్రీధర్, విద్యార్థులు ఉన్నారు.



వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న సీఐ గంగాధర్, సిబ్బంది, విద్యార్థులు

లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్‌గా లింగయ్య



ఆమనగల్లు: లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా ఆమనగల్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు జూలూరు లింగయ్యను.. క్లబ్ జిల్లా గవర్నర్ డా.మహేందర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని నాలుగు క్లబ్‌లలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేసి, ఆదర్శంగా నిలుపుతామని చెప్పారు. ఆయన నియామకం పట్ల క్లబ్ పీఆర్‌ఓ పాషా హర్షం వ్యక్తం చేశారు.

అంతర్గత రోడ్డుకు మరమ్మతు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామం విద్యానగర్ కాలనీ అంతర్గత రోడ్డును, గ్రామానికి చెందిన ముకురాల అశోక్‌గౌడ్ మరమ్మతు చేయించారు. అంతర్గత రోడ్డు గుంతలమయంగా మారి.. ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బుధవారం ట్రాక్టర్ల ద్వారా మట్టిని చదును చేయించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శరత్‌చంద్ర, అనిల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణరెడ్డిని బీజేపీ టౌన్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో మున్సిపాలిటీ వెనుకబడి ఉందని, వార్డుల వారీగా అభివృద్ధికి కృషిచేయాలని కమిషనర్‌ను కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పార్టీలకు అతీతంగా నాయకులు సహకరించాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రాఘవేంద్ర స్వామి, శశిధర్‌రెడ్డి, రూపక్ ఉన్నారు.

ఇంటింటా.. జాతీయ జెండా

హుడాకాంప్లెక్స్: ప్రతిఇంట– జాతీయ జెండా అనే సంకల్పం ప్రతి ఒక్కరిలో ఉండాలని డాక్టర్ దార్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సరూర్‌నగర్‌లోని శ్రీ త్రివేణి పాఠశాలలో విద్యార్థులకు జాతీయ పతాకాన్ని జెల్ పెన్నులతో రూపొందించి, లామినేషన్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి నా వంతు సేవ చేయాలనే కర్తవ్యంలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ సునీల్, ప్రిన్సిపాల్ యోగేశ్వరి ఉన్నారు.

అక్షరాస్యత పెంచడమే 'ఉల్లాస్' లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఆమనగల్లు: అక్షరాస్యత శాతం పెంచడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ఉల్లాస్' పథకం లక్ష్యమని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐకేపీలో పనిచేస్తున్న సీసీలు, పొదుపు సంఘాల మహిళలు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. 15 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యులను గుర్తించాలని చెప్పారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దుమాని పేర్కొన్నారు. సర్వేను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. అనంతరం నిరక్షరాస్యుల అక్షరాస్యత కార్యక్రమం, ఉల్లాస్ యాప్ గురించి శిక్షకురాలు సంతోష వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండు, ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఐకేపీ ఏపీఎం దేవి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకొన్న ప్రభుత్వం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేసిందని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అన్నారు. పథకం విజయవంతం అయిందని పేర్కొంటూ.. బుధవారం సంబురాలు నిర్వహించారు. అధికార పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి వద్ద అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాట ప్రకారం రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం.. వారి ఖాతాల్లో భరోసా నిధులు జమ చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వలన బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజల్లో విశ్వాసం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, భాస్కర్, విష్ణు, జయప్రకాశ్, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కొప్పు కృష్ణంరాజు అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన మృతిపట్ల బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడి కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మిపతిగౌడ్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు కాసోజు శ్రీనివాస్‌చారి కోరారు. బుధవారం సంఘం నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ.. హాల్ నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరగా.. ఆయన భవన నిర్మాణానికి ఎస్టిమేట్ వేయించారని పేర్కొన్నారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న భవనానికి నిధుల మంజూరు విషయంలో కమిషనర్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్‌ను సంఘం నేతలు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మహేశ్‌చారి, కార్యదర్శులు సుధాకర్, బలబ్రహ్మచారి, సలహాదారు వీరచారి, రమేష్‌చారి, దామోదర్‌చారి, జి.శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ప్రధానీ నరేంద్ర మోదీ ఇచ్చిన 'అమ్మకు వందనం' పిలుపుమేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులు మొక్కలు నాటారు. పార్టీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి ప్రతాప్, నాయకులు దయానంద గౌడ్, పాపయ్య గౌడ్, జంగయ్య, విష్ణుగౌడ్, మాజీ సర్పంచ్ వీరస్వామి, ఎంసీ యాదగిరి, సురేష్ గౌడ్ ఉన్నారు.

హడావుడే తప్ప.. చేసిందేమీ లేదు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

- వందరోజుల ప్రణాళిక ఫలితం శూన్యం!
- అస్తవ్యస్తంగా నాలాల దుస్థితి
- డివిజన్‌లో తిష్టవేసిన సమస్యలు
- ప్రభుత్వంపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేసి, సమస్యలు తీర్చకుండానే చేతులు దులుపుకొందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఎద్దేవాచేశారు. నాలాల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. బుధవారం ఆమె సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో పర్యటించారు. కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో డ్రైనేజీ మొదటి దశ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, రెండో దశకు సంబంధించిన నిధులు కూడా మంజూరయ్యాయని గుర్తు చేశారు. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరిగి ప్రారంభించిన పనులు.. వచ్చే ఆరు నెలల్లో పూర్తవుతాయని అంచనా వేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ముంపునకు గురికాకుండా తాత్కాలికంగా కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్‌నగర్ నాలాకు కలిపే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అసోసియేషన్లతో చర్చించి, సమ్మతించుకున్నట్లు తెలిపారు. మట్టిని తొలగించకుండా వదిలేయడం వలన ముంపు పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. వంద రోజుల ప్రణాళిక అంటూ.. ప్రజలను మభ్యపెట్టే బదులు, ప్రజా సమస్యలపై గైడ్‌లైన్స్ ఏమి ఉన్నాయని, అమలు దిశగా ఎలాంటి విధివిధానాలను చేపడుతున్నారని ప్రశ్నించారు. సమస్యలపై ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ప్రజాప్రతినిధులైనా మాకే ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే సామాన్యుల పరిస్థితి ఏంటని వాపోయారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కొండల్ రెడ్డి, అశోక్, అంకిరెడ్డి, నగేష్, సాజిద్, సుశీలరెడ్డి, గౌని శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, మహేందర్, రాజు యాదవ్, సునీల్‌యాదవ్, అరుణ్‌కుమార్, ఉత్తిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.